క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్, రైటర్, నాగరాజు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పూజా సామగ్రి దుకాణం దగ్ధం

చంద్రగిరి: పూజా సామగ్రి దుకాణం అగ్నికి ఆహుతైన ఘటన గురువారం అర్ధరాత్రి చంద్రగిరి నాగాలమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. చంద్రగిరి పాతపేట దిగువవీధికి చెందిన మునికృష్ణారెడ్డి మూడు నెలల నుంచి పూజా సామగ్రి, కూల్ డ్రింక్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి వ్యాపారం ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దుకాణంలో మంటలు వస్తున్నాయంటూ వాచ్‌మన్ ఫోన్ చేసి చెప్పడంతో పరుగున దుకాణం వద్దకు చేరుకున్నాడు. అప్పటికే దుకాణం దగ్ధం కావడంతో బాధితుడు బోరున విలపించాడు. గురువారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలను నాగాలమ్మ ఆలయం మీదుగా నిర్వహించారు. ఈ క్రమంలో ఉద్దేశపూర్వకంగా తన దుకాణంలో ఆకతాయిలు నిప్పు వేసినట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. సుమారు రూ.1.30లక్షల విలువైన సామగ్రితో పాటు రెండు ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అలిగి వెళ్లిన బాలికల అప్పగింత

తిరుపతి క్రైమ్: నగరంలోని జీవకోనలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికలు పారిపోగా.. వారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అలిపిరి సీఐ రామకిషోర్ కథనం మేరకు.. తల్లిదండ్రులు మందలించడంతో పిల్లలు గురువారం ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయారు. వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామన్నారు. బాలికలను పార్వతీపురంలో పట్టుకున్నామని తెలిపారు.

గౌతమ బుద్ధిని త్రీడీ వాల్ పేపర్




సముద్ర వ్యూతో ఆహ్లాదాన్ని పంచుతున్న త్రీడీ వాల్ పేపర్



ఇళ్లల్లో ఏర్పాటుచేసిన వివిధ ఆకృతుల త్రీడీ వాల్ పేపర్లు



కలల గృహం.. కళా సౌరభం



ఉరుకుల పరుగుల జీవితంలో అలసి..సొలసిన వేళ ఆహ్లాదకరం పంచే పచ్చదనం.. గలగల పారే సెలయేళ్లు.. పరశించిపోయే ప్రకృతి ఒడి.. ఆధ్యాత్మికత పంచే ప్రబోధకులు చెంత ఉంటే ఎంత బాగుంటుదోనని ఆలోచిస్తున్నారా? ఇవన్నీ ఇప్పుడు మీ కలల సౌధంలోనే మీ చెంతకే వస్తున్నాయి. ప్రశాంత వాతావరణంలో మీరు సేద తీరేలా చేస్తున్నాయి? ఎలా అని ఆలోచిస్తున్నారా? నేడు త్రీడీ వాల్ పేపర్లతో మీ కలల గృహానికి కళా సౌరభం చేకూరుతోంది. తిరునగరిలోని పలువురు ఇలా తమ ఇంటిని అలంకరించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. దీనిపై ప్రత్యేక కథనం.

- తిరునగరిలో...త్రీడీ కల్చర్
- త్రీడీ వాల్ పేపర్లపై యువత మొగ్గు
- రీడింగ్ రూమ్, బెడ్ రూమ్‌లలో ఏర్పాటు చేస్తున్న వైనం
- ఖర్చుకు వెనుకాడకుండా ఆన్‌లైన్ ఆర్డర్లు
- సామాన్యుడి నుంచి ఉన్నత వర్గాల ఇళ్లలో కనువిందు డిజైన్లు

తిరుపతి తుడా: ఇప్పటి వరకు మనం థియేటర్‌లో త్రీడీ సినిమాలు చూసి ఉండొచ్చు.. కానీ ఇంట్లో కూర్చుని త్రీడీ కిటికీలు ఎప్పుడైనా చూశారా? పడక గదిలో నక్షత్ర మండలాన్ని చూశారా? అత్యాధునిక టెక్నాలజీతో ప్రస్తుతం మార్కెట్లోకి త్రీడీ కిటికీలు, తలుపులు, నక్షత్ర మండలం.. ఇలా చాలా అందుబాటులోకి వచ్చాయి. త్రీడీలో సినిమా చూసి అద్భుతమైన అనుభూతిని పొందుతాం. అదే ఇంట్లో త్రీడీ కిటికీలు ఉంటే.. తలుపులు ఉంటే.. నక్షత్రాలు బెడ్రూమ్‌లో దర్శనమిస్తే.. ఆ ఊహే మనసును ఎంతో ఉల్లాసపరిచేదిగా ఉంటుంది. డిజిటల్ ప్రింటింగ్ అరంగ్రేటంతో ప్రతీ దృశ్యం మన కళ్ల ముందే ఉన్నట్లుగా ఉంటుంది. మనకు తెలియని కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నట్లు ఉంటుంది. ఇంట్లో కూర్చుని పచ్చని అటవీ అందాలు వీక్షించవచ్చు. సొగసైన జలపాతాలు చూడవచ్చు. క్రికెట్ స్టేడియంలో ఉన్నట్లు ఫీల్ కావచ్చు. గోడలపై బీచ్ రోడ్డు పక్కనే ఉన్న కొబ్బరిచెట్లు పెరుగుతున్నట్లు అనిపించవచ్చు.

డ్రీమ్ హౌజ్‌కు...అట్రాక్టివ్ లుక్

నగరంలో కొత్తగా ఇల్లు కట్టుకునే వారు ప్రస్తుతం మార్కెట్లో న్యూ ట్రెండ్ ఏం నడుస్తుందని ఇంటర్నెట్‌లో శోధిస్తున్నారు. దేశ, విదేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక హంగులపై ఆరా తీస్తున్నారు. తమ అభిరుచులకు తగ్గట్లు వస్తువులను ఆర్డర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కిటికీలు, తలుపులు, గోడలు, బెడ్రూమ్‌లో సరికొత్త డిజైన్లు దర్శనమిస్తున్నాయి. కొంత కాలంగా నచ్చిన సీనరీ, చిత్రాలను గోడలకు, విండోలకు స్టిక్కర్ అతికించే పద్ధతి కొనసాగుతోంది. ఇటీవల మరింత అప్ గ్రేడ్ అయ్యారు. త్రీడీ టెక్నాలజీ ఆ స్థానాన్ని భర్తీ చేస్తోంది. కస్టమైజ్ బ్లైండ్స్, జీబ్రా బ్లైండ్స్, ఉడెన్ బ్లైండ్స్, పీవీసీ బ్లైండ్స్, రోలర్ బ్లైండ్స్ అందుబాటులోకి వచ్చాయి. స్థాయి ఆధారంగా కనీసం రూ.200 (ఒక అడుగు) నుంచి గరిష్టంగా రూ.500 వరకు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా ఇంట్లోకి రూమల్ బ్లైండ్స్ను ఫ్యాబ్రిక్‌తో తయారు చేస్తున్నారు. కిటికీలు, డోర్‌లకు పీవీసీ బ్లైండ్స్ వినియోగిస్తున్నారు. ఇంటి యజమాని అభిరుచికి తగ్గట్లు చిత్రాలతో అందుబాటులోకి తెస్తున్నారు. పెద్దపెద్ద కార్పొరేట్ ఆఫీసుల్లో మాత్రం సంస్థ లోగో, చేసే పనికి సంబంధించిన థీం చిత్రాలను త్రీడీ టెక్నాలజీలో అనుభూతి పొందుతున్నారు.

వేడుకల్లోనూ ఆ సోయగాలే..

త్రీడీ తెరలతో చాలా మంది వేడుకల్ని సైతం సింపుల్‌గా కానిచ్చేస్తున్నారు. ముఖ్యంగా ఓ గంట ఫంక్షన్‌కి పూలు, అలంకరణ అంటే అంత ఖర్చు ఎందుకు దండగ అనుకుని త్రీడీ బ్యాక్ డ్రాప్ స్క్రీన్స్ కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఒక దఫా కొంటే తర్వాత ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు. డెకరేటర్లు చేసిన వేదికల ఫొటోలను యథాతథంగా తెరమీదకి తెచ్చేస్తోంది. దీంతో అలంకరణ ఖర్చు తగ్గుతోంది. పూలు లేకుండానే ఫొటోల్లో పూల అలంకరణ కనిపించేస్తుంది. త్రీడీ మాయతో కనువిందు చేస్తోంది.



కిడ్స్ రూమ్‌లో యానిమేషన్ త్రీడీ వాల్ పేపర్

రిలాక్స్ అవుతున్న కుటుంబం

నగరంలో సగటు వ్యక్తులు ఉద్యోగం, వ్యాపారం, ఇతర పనులతో రోజంతా కుటుంబం బిజీబిజీగా గడిపేస్తున్నారు. ఇంటికి వచ్చి రిలాక్స్ పొందే ఆహ్లాదకర వాతావరణం కోసం వెరైటీ డిజైన్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆహ్లాదకరమైన ప్రదేశంలో కూర్చుని అలా రిలాక్స్ అవుతున్నారు. ఒత్తిడి నుంచి ఒక్కసారిగా ప్రకృతి ఒడిలోకి ఒదిగిపోయినట్లు ఫీల్ అవుతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సమయం గడిపేస్తున్నారు. త్రీడీ టెక్నాలజీ ఎంత బాగుందో కదా.

అప్‌గ్రేడ్ అవుతున్నారు

నగరంలో ఒకే మోడల్ ఎక్కువ రోజులు వినియోగంలో ఉండదు. మారుతున్న కాలంతో పాటే ఇక్కడి ప్రజల అభిరుచులు మారుతున్నాయి. వాల్‌కి అతికించే ఇమేజ్‌ల నుంచి ప్రస్తుతం త్రీడీ టెక్నాలజీ వరకు ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవుతున్నారు.



ప్రకృతి విలసిల్లేలా ఏర్పాటు చేసిన వాల్ పేపర్



రాధాకృష్ణుల సోయగం



ధ్యానం చేస్తున్న బుద్ధుడు

ఎస్వీయూలో 'నీలిట్' ఏర్పాటుకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సీహెచ్ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నీలిట్ సంస్థ ఏర్పాటుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. శుక్రవారం పరిపాలనా భవనం వీసీ ఛాంబర్‌లో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు అధ్యక్షతన ఎస్వీయూ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పాలక మండలి సభ్యులు నేరుగా పాల్గొనగా, అమరావతి నుంచి ఉన్నత విద్యామండలి అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొని పలు అంశాలకు ఆమోద ముద్ర వేశారు. ఇందులో ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సంస్థను తిరుపతికి తీసువచ్చేందుకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి కేంద్రంతో పలుసార్లు సంప్రదించారు. దీంతో గత ఏడాది నీలిట్ సంస్థను ఎస్వీయూలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆమోదించింది. ఈ సంస్థను ఏర్పాటుకు పాలకమండలి సైతం నేడు ఆమోద ముద్రవేసింది. దీంతో పాటు మరో 8 అంశాలపై పాలకమండలి ఆమోదం తెలిపింది.

ఇందులో ప్రధానంగా..

- వర్సిటీలోని మైక్రోబయాలజీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.1.02 కోట్ల నిధుల విడుదలకు ఏకగ్రీవ ఆమోదం లభించింది.
- ఫార్మసీ భవన నిర్మాణానికి రూ.2.08 కోట్లకు అనుమతి ఇచ్చారు.
- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నీలిట్)ని వర్సిటీలో ఏర్పాటు చేయడానికి పాలకమండలి ఆమోదం లభించింది.
- వర్సిటీకి అనుబంధంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో విద్యార్థుల టాయిలెట్స్ కోసం రూ.76.80 లక్షల నిధులు మంజూరు.
- వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో టాయిలెట్ల కోసం రూ.85 లక్షల మంజూరుకు ఆమోదం తెలిపారు.
- ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రమోషన్ల కోసం పాలకమండలి సమ్మతి తెలిపింది.
- దూరవిద్య విభాగంలో స్టడీ మెటీరియల్‌కు ప్రింటింగ్ సంబంధించిన పెండింగ్ బిల్లులకు పాలకమండలి ఆమోదం లభించింది.
- ఎస్వీయూకు అనుబంధంగా ఉన్న మూడు టీటీడీ అనుబంధ కళాశాలలు, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలకు అటానమస్ సౌకర్యం కల్పించడానికి పాలకమండలి ఆమోదం తెలిపింది.
- దూరవిద్య విభాగం పేరును ఇక నుంచి 'సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ లెర్నింగ్'గా మార్చుతూ పాలకమండలి ఆమోదం తెలిపింది. దూరవిద్యలో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆన్‌లైన్ ద్వారా అందజేయనున్నారు. ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కే రామ్మోహన్‌రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పాలకమండలి సభ్యులు బి సుగుణమ్మ, డాక్టర్ సురేంద్ర నాథ్‌రెడ్డి, పద్మనాభం, కోలా మంజుల, డాక్టర్ మొద్దీన్‌బాషా, నారాయణ బాబు హాజరయ్యారు. వీరితో పాటు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, ప్రొఫెసర్ సుమకిరణ్ , ప్రభుత్వ ఆర్థిక శాఖ విభాగం నుంచి డిప్యూటీ సెక్రటరీ ఆదినారాయణ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయండి

– డిపో మేనేజర్లకు ఈడీ చెంగల్‌రెడ్డి ఆదేశాలు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వందశాతం కండిషన్‌లో ఉన్న బస్సు సర్వీసులను ఎంపిక చేయాలని కడప జోన్–4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి డీపీటీఓ(జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, మెకానిక్ సూపర్‌వైజర్లు, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం కండిషన్‌లో ఉండే సర్వీసులను డిపోల వారీగా డీఎంల నుంచి స్వీకరించారు. 341 సర్వీసులు వంద శాతం కండిషన్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సర్వీసులను రోజుకు 2,700 ట్రిప్పులు తిప్పాలని ఆదేశించారు. అక్టోబర్ 9వ తేదీ గరుడోత్సవం రోజుతోపాటు 12వ తేదీ చక్రస్నానం శనివారం వస్తున్న నేపథ్యంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నేతలు బ్రహ్మోత్సవాల్లో పూర్తి సహకారం అందించాలని సూచించారు. అవసరం అయితే ఎప్పటిలాగానే బ్రహ్మోత్సవాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులను తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ప్రతి డిపో నుంచి బ్రహ్మోత్సవాలకు బస్సులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గత బ్రహ్మోత్సవాల్లో చోటుచేసుకున్న చిన్న చిన్న పొరబాట్లును సరిదిద్దుకుని ముందుకు సాగాలని తెలిపారు. నిర్లక్ష్యంగా వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

2.7 కిలోల గంజాయి స్వాధీనం

– ఐదుగురి అరెస్టు

తిరుపతి క్రైమ్: అక్రమంగా విక్రయిస్తున్న 2.7 కిలోల గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపారు. జీవకోనలో గంజాయి అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమదైన శైలిలో దాడులు చేసి శ్రీకాకుళంలో నివాసముంటున్న హరిబాబు, జీవకోనకు చెందిన ముత్తుకూరు గోపీచంద్, వేదాల ఇశ్రాయేలు, చెందుతోపాటు మరో బాల నేరస్తుడిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 2.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సంక్షేమ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కార్మిక శాఖ కమిషనర్ చిన్న లాలప్ప

తిరుపతి కల్చరల్: కార్మిక శాఖ అందిస్తున్న సంక్షేమ పథకాలను మెకానిక్‌లందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎస్. చిన్నలాలప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్ ఆవరణలో తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్‌తో పాటు కార్మిక శాఖ అధికారులు ఎం.రాజయ్య, ఎం.ప్రవీణ్ కుమార్, జె.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ చిన్న లాలప్ప మాట్లాడుతూ ప్రతి మెకానిక్ కార్మిక శాఖలో తన పేరు రిజిస్ట్రేషన్ చేసుకుని, సభ్యత్వం నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇ–స్కీమ్ గుర్తింపు కార్డులు పొంది తద్వారా కార్మిక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి జలంధర్, కోశాధికారి గౌస్‌బాషా, సహాయ కార్యదర్శి గుర్నాథం ఆచారి, కమిటీ ఇన్‌చార్జ్ సోము, లక్ష్మణరావు, కేశవ, పాపయ్య, రాము, మెకానిక్ సభ్యులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ గిఫ్ట్‌గా ఇచ్చారు

- విద్యాశాఖామంత్రి లోకేష్ జోక్యంతోనే వేటు
- ఆర్డీఓకి వైఎస్సార్‌సీపీ ముద్ర వేసిన ఎమ్మెల్యే



నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ

తిరుపతి అర్బన్: 'శ్రీవేంకటేశ్వరస్వామి పాదల చెంత పనిచేసే అవకాశం వచ్చిందని ఎంతో సంతోషపడ్డాను. ఆ మేరకు తిరుపతిలో బాధ్యతలు స్వీకరించారు. ఆ భగవంతుడు పాదాల చెంత 11 నెలలుపాటు పనిచేసే భాగ్యం లభించింది. నేను ఏ తప్పూ చేయలేదు. అయితే తిరుపతికి వచ్చినందుకు నాకు సస్పెన్షన్ గిఫ్ట్‌గా ఇచ్చారు.' అని ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి ఆవేదన చెందారు. తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిని శుక్రవారం రాత్రి సస్పెండ్ చేశారు. పుత్తూరులో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి అవసరం అయిన ఎన్ఓసీ జారీ చేయడంలో అవినీతి చోటుచేసుకున్నట్లు ఆయనపై ఓ వ్యక్తి ఆరోపణలు చేశారు. ఈ అంశంపై గతంలో ఓ ఐఏఎస్ అధికారి విచారణ చేపట్టినప్పటికీ అందులో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి తప్పిదం లేదని రిపోర్ట్ ఇచ్చినట్లు చర్చ సాగింది. దీంతో ఆ ఘట్టం ముగిసిందని అంతా భావించారు. అయితే గత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గం ఆర్వోగా నిషాంత్‌రెడ్డి పనిచేశారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినప్పటికీ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితోపాటు ఆ పార్టీకి చెందిన కొందరు ఆర్డీఓపై వైఎస్సార్‌సీపీ ముద్ర వేశారని చర్చసాగింది. వైఎస్సార్‌సీపీకి అనుకూలం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం కూడా సాగించారు. ఈ క్రమంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొద్దిరోజుల్లోనే ఆయన్ని బదిలీ చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన విద్యాశాఖామంత్రి లోకేష్‌కు ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు వెంటనే విజయవాడ ఉన్నతాధికారులతో మాట్లాడి సస్పెండ్ చేయించారని అంతా భావిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో అనంతపురం నుంచి బదిలీపై వచ్చిన ఆయన తిరుపతి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టారు. 11 నెలలుపాటు తిరుపతి ఆర్డీఓగా పనిచేసిన ఆయన నిత్యం అందరికీ అందుబాటులో ఉంటూ పలు సమస్యలకు పరిష్కారం చూపించారు. అందర్ని మన్ననలు పొందారు. అయితే టీడీపీ కూటమికి ఆయన గిట్టకపోవడంతోనే సస్పెన్షన్ వేటు పడిందని తెలుస్తోంది. ఆర్డీఓ బాధ్యతలు శుక్రవారం ఎవరికీ అప్పగించలేదు. శనివారం కొత్తవారికి ఇస్తారన్న చర్చసాగుతుంది.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



కమిలిపోయిన విద్యార్థి వీపు

భాకరాపేట : హోమ్ వర్క్ చేయలేదని విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రావారిపాళెం మండలం చింతగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నాలుగో తరగతి విద్యార్థి సాధ్విక్‌ను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్‌నాయుడు ఇంటి వద్ద హోమ్ వర్క్ చేయక పోవడంతో నోటుబుక్ కూడా తీసుకురాలేదని చితకబాదారు. దీంతో విద్యార్థి వీపు మీద వాతలు పడ్డాయి. ఈ విషయమై ఎంఈఓ బాలసుబ్రమణ్యాన్ని వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే పాఠశాలకు వెళ్లి విచారించానన్నారు. విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి విచారించగా తమ బిడ్డ ఇంటి వద్ద హోమ్ వర్క్ చేయడం లేదని తెలిపారని చెప్పారు. ఉపాధ్యాయుడు కొట్టడంపై డీఈఓకు నివేదిక పంపుతున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

మానసిక రోగులకు సేవలు

తిరుపతి కల్చరల్ : మానసిక రోగుల రహిత సమాజమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని మనోబంధు ఫౌండేషన్ మేనేజర్ రామకృష్ణమరాజు తెలిపారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో మానసిక రోగంతో వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిని గుర్తించి మంచి వైద్యం అందించి, వారి బంధువులకు అప్పగించామని వెల్లడించారు. మానసిక రోగుల సమాచారాన్ని ఫౌండేషన్ వలంటీర్లకు అందించాలని కోరారు. వివరాలకు 9246563738 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పి.అంజయ్య, బాబు, కేశవులు, భాస్కర్, జయపాల్, నాగేంద్ర పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో రిజర్వేషన్‌కు వినతి

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వం కేటాయించే మద్యం షాపులలో ఎస్సీ,ఎస్టీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సేవాదళ్ నేత తలారి రాజేంద్ర విన్నవించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో సేవా దళ్ నేతలు రాజశేఖర్, వంశీ, విజయ్, సంజీవి, వాసు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు చేయూత



సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

తిరుపతి(అలిపిరి): ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం చేతి వృత్తులు చేసుకునే వారికి చేయూతనందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకం ప్రారంభమై ఏడాది పూర్తి కావడంతో మహారాష్ట్ర నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో సందేశం వినిపించారు. శుక్రవారం స్థానిక కచ్చపి ఆడిటోరియం నుంచి మంత్రితోపాటు ఎమ్మెల్యే ఆరణి, జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాల సాధికారికతకు చేతి వృత్తుల వాళ్లే ప్రధానమన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి 5 శాతం వడ్డీతో రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందించడం సంతోకరమన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. స్కిల్ డెవలప్మెంట్ ఈడీ దినేష్ కుమార్, యూనియన్ బ్యాంకు డీజీఎం రాంప్రసాద్, డీపీసీ జీఎం ప్రతాపరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి పాల్గొన్నారు.

కొత్త హంగులతో ఎల్‌జీ ప్రొడక్ట్స్


రిఫ్రిజరేటర్లను ఆవిష్కరిస్తున్న ఎల్‌జీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : కొత్త హంగులతో నూతన టెక్నాలజీ బ్రాండ్ల రిఫ్రిజరేటర్లను ఏబీ ఎలక్ట్రానిక్స్ ఎల్‌జీ డిస్ట్రిబ్యూటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మానస సరోవర్‌లో ఎల్‌జీ స్టేట్ హెడ్ కృష్ణాజీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను ఆకట్టుకునే విధంగా ఈ మోడల్ రూపొందించి మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. అత్యంత నాణ్యమైన ఎల్‌జీ రిఫ్రిజరేటర్లు, ఇతర ఉత్పత్తులు ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఏబీ ఎలక్ట్రానిక్స్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌జీ డిస్ట్రిబ్యూటర్స్ బుసగాని మహేష్ యాదవ్, బుసగాని మహేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో సినీ డైరెక్టర్ కొరటాల శివ, ఎమ్మెల్యే విరుపాక్షి, తెలంగాణ ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

మంత్రిని కలిసిన వైద్య బృందం

తిరుపతి తుడా : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శుక్రవారం తిరుపతిలో పలువురు వైద్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ పీఏ చంద్రశేఖరన్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.రవి ప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ పార్థసారధిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, ఎస్వీ వైద్య కళాశాల పీఆర్‌ఓ వీర కిరణ్ ఉన్నారు.

హుండీ చోరీ

తిరుపతి మంగళం : వినాయకసాగర్ సమీపంలోని బొంతాలమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి దుండగులు హుండీని చోరీ చేశారు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా ఊంజల్ సేవ

నారాయణవనం : పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అమ్మవారికి విశేష అభిషేకం జరిపించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం కనుల పండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తుత్తి హామీలకు వందరోజులు

నేంద్రగుంట వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నారా లోకేష్, పక్కన పులివర్తి నాని (ఫైల్)


ఎలాగైనా గెలవాలి.. అధికారం అనుభవించాలి.. తరాలకు సరిపడా సంపాదించుకోవాలి.. ఇందుకోసం ప్రజలను నమ్మించాలి.. ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించాలి.. ఓట్లు రాబట్టుకోవాలి.. ఇదే లక్ష్యంతో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రణాళిక రూపొందించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పక్కాగా అమలు చేశారు. ఓటర్లకు మాయమాటలు చెప్పారు. అలవికానీ హామీలతో ఊరూవాడా ఊదరగొట్టారు. ఎట్టకేలకు మాయో.. మిషన్ల మంత్రమో కానీ.. గద్దెనెక్కారు. అయితే వంద రోజులు గడుస్తున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా అదిగో ఇదిగో అంటూ మభ్యపెడుతూ జనం చెవిలో పువ్వులు పెడుతున్నారు.

- నేంద్రగుంటలో 10 పడకల ఆస్పత్రి ఏమైంది..?
- శెట్టిపల్లె వాసులకు ఇంటి పట్టాలు ఎప్పుడు..?
- చంద్రగిరిలో మినీ ఐటీ పార్కు ఎక్కడ..?
- తిరుపతి రూరల్‌లో మెడికల్, లైఫ్ సైన్సెస్ క్లస్టర్ ఏదీ..?
- పాకాలలో గార్మెంట్ పరిశ్రమ కలేనా..?
- చిన్నగొట్టిగల్లులో పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏవీ..?

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో నిర్వీర్యంగా పాలన నడుస్తోంది. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డదిడ్డమైన హామీలు ఇచ్చారు. పాలన చేయడం వ్యాపారం చేయడం కాదని అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కూటమి నేతలకు తెలిసివచ్చింది. ప్రజలు చర్చించుకుంటున్నట్లు ఈవీఎంల దయతో అధికారంలోకి 100 రోజులైనా ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో ఎక్కడికక్కడ జనం కూటమి నేతలను నిలదీస్తున్నారు. దీంతో ఫ్రస్టేషన్‌కు గురవుతున్న కూటమి నేతలు ప్రజలపైనే తిట్ల దండకం ఎత్తుకుంటున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి నియంతలాగా వ్యవహరించడం, బదిలీల నుంచి కబ్జాల వరకు ఇష్టారాజ్యంగా చేస్తున్నాడనే కూటమి నేతలే తమ అధిష్టానాలకు ఫిర్యాదులు చేస్తున్నారు.

100 రోజుల్లో ఒక్కటీ అమలు చేయలేదు

టీడీపీ అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతుంది. ఇప్పటి వరకు గత ప్రభుత్వంపై ఏడుపులు, విమర్శలు, కక్ష సాధింపులతోనే పాలన సాగించారు. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నేంద్రగుంటలో 10 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని సాక్ష్యత్తు నారా లోకేష్ తన యువగళం పాదయాత్ర 400 కిలోమీటర్లకు చేరుకున్న సందర్భంగా శిలాఫలకం వేసి మరీ హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకు అది అమలు కాలేదు. అలాగే చంద్రగిరి మండలంలో


యువగళం పాదయాత్రలో దామలచెరువు వద్ద సభలో హామీలు గుప్పిస్తున్న లోకేష్ (ఫైల్)

మినీ ఐటీ పార్కు నెలకొల్పి 2,500 మందికి ప్రత్యక్షంగా 3,500 మందికి పరోక్షంగా ఉపాధి చూపిస్తామన్నారు. పార్కు పత్తా లేదు.తిరుపతి రూరల్ మండలంలో మెడికల్, లైఫ్ సైన్స్ క్లస్టర్ తీసుకువచ్చి ఆధునాతన కారిడార్ నిర్మిస్తామని, ప్రత్యక్షంగా వెయ్యి మందికి, పరోక్షంగా 1,500 మందికి ఉపాధి చూపుతామన్నారు. క్లస్టర్ ఊసే లేదు. పాకాల మండలంలో గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. కానీ ఆ ధ్యాసే కనిపించలేదు. రామచంద్రాపురం మండలంలో మెడికల్ పరికరాల తయారీ, వాటి అనుబంధ విభాగాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే చిన్నగొట్టిగల్లు మండలంలో మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని, తిరుచానూరు, తిరుమల, తలకోన లను అనుసంధానం చేస్తూ ట్రిబుల్ టీ(టీటీటీ) టూరిజం ప్యాకేజీని తీసుకురావడమే కాకుండా ఎకో థీమ్ పార్కులను నిర్మిస్తామన్నారు. కానీ కనీసం వాటి ఏర్పాటుకు ప్రయత్నాలు కూడా ప్రారంభించిన దాఖలాలు లేవు. ఉమ్మడి శెట్టిపల్లి వాసులకు సుదూర ప్రాంతాల్లో కాకుండా స్థానికంగానే ఇంటి పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీని పట్టించుకోవడంలేదు.

నిలదీస్తున్న ప్రజలు

ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానిని నిలదీస్తున్నారు. ఇటీవల మంగళంలో పర్యటించినప్పుడు కూడా స్థానికంగానే ఇంటి పట్టాలు ఇచ్చి, భూమిని కూడా ఇక్కడే చూపుతామని ఇచ్చిన హామీపై కొందరు నిలదీశారు. ఏ నియోజకవర్గంలోనే మొదటిదిగా తిరుపతి రూరల్ మండలం మంగళం పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని, అధికారులు హాజరుకానున్నారు. వంద రోజుల పాలనలో ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా వస్తున్నారు. ఇది మంచి ప్రభుత్వం పేరుతో వంద రోజుల పరిపాలన ప్రగతి పేరుతో జనం మధ్యకు రానున్నారు. ఈ క్రమంలో హామీలను ఎప్పుడు అమలు చేస్తారని మరోసారి నిలదీసేందుకు స్థానికులు సిద్ధంగా ఉన్నారు.

సంతోషం.. పితృపక్షం అన్నదానం


భక్తులకు భోజనం వడ్డిస్తున్న మేయర్ శిరీష

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు యోగిమల్లవరంలోని శ్రీ సాలగ్రామ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహిస్తున్న పితృపక్ష అన్నదానంలో పాల్గొనడం సంతోషంగా ఉందని మేయర్ శిరీష తెలిపారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 తేదీ వరకు 16 రోజులపాటు నారద పీఠం ఆధ్వర్యంలో పితృపక్షం అన్నదానం జరిపిస్తున్నారు. మేయర్ మాట్లాడుతూ భాద్రపద పూర్ణిమ నుంచి అమావాస్య వరకు పితృ దేవతలను తృప్తి పరచే పనులు చేయటం ద్వారా పితృ రుణం తీర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. నారదపీఠం వ్యవస్థాపకుడు దినేష్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ వేణుగోపాల్, మేడ సాని సురేందర్ నాయుడు, రూపేష్, దీప, అనురాధ పాల్గొన్నారు.

ఎస్పీడబ్ల్యూలో 'హిందీ సప్తాహ్'

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం హిందీ సప్తాహ్ సమరోహ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు మాట్లాడే భాషల్లో హిందీ మూడో స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ కె ఉమారాణి, హిందీ విభాగాధిపతి పి.వెంకటలక్ష్మి, అధ్యాపకులు జి.సుధాకర్, రాధాకృష్ణ, లక్ష్మీ సంధ్య, శ్రీలక్ష్మీ, పద్మజ పాల్గొన్నారు.

తూతూమంత్రం.. 'మంచి ప్రభుత్వం'


ఎమ్మెల్యే సభలో ఖాళీ కుర్చీలు

తిరుపతి మంగళం : వంద రోజుల పాలనపై శుక్రవారం జీవనకోనలోని రాజీవ్‌గాంధీ కాలనీలో చేపట్టిన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తూతూమంత్రంగా నిర్వహించారు. తమకు అనుకూలమైన వారితో నాలుగు మెప్పు మాటలు చెప్పించి ముగించారు. అయితే కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనపై నగర ప్రజలు గుర్రుమంటున్నారు. ఏదో సాధించేసినట్లుగా, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు అమలు చేసినట్లుగా × ఇది మంచి ప్రభుత్వం । అని చెప్పుకోవడంపై మండిపడుతున్నారు. టీడీపీ కోసం పనిచేసిన వారికే ఎలాంటి న్యాయం చేయడంలేదని, ఇక ప్రజలకు ఏం చేస్తారని స్థానిక నేత శ్యామలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో వెంటనే ఆమె వద్ద నుంచి మైక్ లాగేసుకుని కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడే ముగ్గురిని సెలక్ట్ చేసుకుని వారితో మాట్లాడించుకున్నారు. గ్యాస్ సిలిండర్లు, కొత్త రేషన్‌కార్డులు, తల్లికి వందనంపై ప్రశ్నించేందుకు వచ్చిన మహిళలకు అవకాశం కల్పించలేదు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే పెద్దసంఖ్యలో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

హాస్యాస్పదంగా ఫ్లెక్సీలు

ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోయినా ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి స్థానికులు నవ్వుకున్నారు. ఇవి ఎక్కడ అమలు చేశారని ఘనంగా ఫ్లెక్సీలు పెట్టారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలోనే వేదికపైన ఎమ్మెల్యేతో పాటు ముందు వరుసలో కూర్చునేందుకు టీడీపీ, జనసేన నాయకులు కుర్చీలు చేతపట్టుకుని పోటీ పడ్డారు.

వైద్యశాఖ మంత్రికి సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న తిప్పారెడ్డి

తిరుపతి సిటీ: రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్ తిప్పారెడ్డి ఘనంగా సన్మానించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నరేంద్రమోదీ పాలనలో భారతదేశం నంబర్ ఒన్‌గా ప్రశంసలందుకుంటోందని తెలిపారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ లా కళాశాలలో చదివిన విద్యార్థి మంత్రి స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా తెలుగు స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సురేష్, ప్రిన్సిపల్ బిజయ్‌కుమార్ బెహ్రా, ఆర్.లక్ష్మీ ప్రశాంతి పాల్గొన్నారు.

బైక్ స్టంట్‌లపై సోషల్ మీడియాలో పోస్టులు

- యువకుడిపై కేసు నమోదు చేసిన అలిపిరి పోలీసులు

తిరుమల: బైక్ స్టంట్స్ చేస్తూ సోషల్ మీడియాలో వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న యువకుడిని అలిపిరి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అలిపిరి సీఐ రామకిషోర్ మాట్లాడుతూ మంచాల వీధికి చెందిన రమేష్ బాబు కుమారుడు రాఘవేంద్ర రోహిత్ రెడ్డి యమహా ఆర్‌జెడ్ 15 మోటార్ సైకిల్‌ను లైసెన్స్ లేకుండా అతివేగంగా నడుపుతూ ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. విచిత్రమైన చేష్టలతో వింత శబ్దాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బైక్‌పై స్టంట్‌లు చేస్తున్న వీడియోలను తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవాడన్నారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని, బైక్ సీజ్ చేశామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు తన సోషల్ మీడియా అకౌంట్‌లో తనను పోలీస్


సీజ్ చేసిన బైక్‌తోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న అలిపిరి పోలీసులు

వారు పట్టుకున్న ఫొటోను సైతం షేర్ చేస్తూ, తన లాగా ఎవరు ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు చేసి, సాధారణ ప్రజలకు అపాయం కలిగించవద్దని పోస్ట్ చేశాడని వెల్లడించారు

శ్రీశక్తి పీఠానికి సిద్ధేశ్వరానందభారతి

రామచంద్రాపురం: వారణాసిలో చాతుర్మాస దీక్షను సంపూర్ణంగా పూర్తిచేసుకున్న కుర్తాళం శంకరాచార్యులు, శ్రీశక్తి పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, పీఠాధీశ్వరి రమ్యానంద భారతీతో కలసి శుక్రవారం రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠానికి చేరుకున్నారు. అంతకుముందు రేణిగుంట విమానాశ్రయం వద్ద భక్తులు స్వాగతం పలికారు.


రేణిగుంట విమానాశ్రయంలో భారతీస్వామి

తిరుచ్చిపై సిరుల తల్లి

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అభిషేకం చేసి, సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి

తిరుపతి కల్చరల్ : కార్మికుల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని కార్మిక శాఖ సహాయ కమిషనర్ చిన్న లాలప్ప తెలిపారు. శుక్రవారం శ్రీబాలాజీ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మోహన్ ఆధ్వర్యంలో యూవత్ హోస్ట్‌ల్లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక శాఖ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మోహన్ మాట్లాడుతూ కార్మిక శాఖ ద్వారా నగరంలో పని చేసే టూవీలర్ మెకానిక్‌లకు చేకూరే


మాట్లాడుతున్న చిన్న లాలప్ప

లబ్ధిని తెలిపారు. ఈఎస్‌ఐ , రవాణా శాఖ ద్వారా లైసెన్సులు పొందేలా కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు హరి ప్రసాద్, చందు, విశ్వనాథ్, షఫీ, గోపి పాల్గొన్నారు.

కన్ను పడితే కబ్జా..!

అధికార బలంతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో అక్రమార్కులకు సైతం అండగా నిలబడుతున్నారు. కబ్జా చేసిన స్థలాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. పచ్చమూక పేట్రేగిపోయి కంటికి కనిపించిన భూములను స్వాహా చేస్తుంటే రెవెన్యూ అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణల పర్వంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇదే అదునుగా తెలుగు తమ్ముళ్లు అడ్డూ అదుపు లేకుండా జేబులు నింపుకుంటున్నారు.

- ఆక్రమణ పర్వానికి తెరతీసిన టీడీపీ నేతలు
- రామిరెడ్డిపల్లె పంచాయతీలో ప్రభుత్వ భూములే టార్గెట్
- అధికార బలంతో అక్రమ నిర్మాణాలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు


ఆక్రమిత స్థలంలో ప్రహరీ గోడ నిర్మిస్తున్న టీడీపీ మద్దతుదారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీడీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆ పార్టీ నేతలు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపించినా హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం రామిరెడ్డిపల్లి పంచాయతీలో సర్కారు భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు మౌనం వహించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

టీడీపీ నేతల అండతో..

రామిరెడ్డిపల్లె పంచాయతీ లెక్కదాఖల ఆంజనేయపురం ఎస్టీ కాలనీ సర్వే నంబరు 21లో సుమారు 40 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ భూమిపై ఆర్టీసీ ఉద్యోగి కన్ను పడింది. తమకున్న 1.5 సెంట్ల పట్టాను అడ్డుగా పెట్టుకుని పక్కనే ఉన్న సుమారు 40 సెంట్లు ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. టీడీపీ నేతల అండతో మూడు ఇళ్లు, భారీ ప్రహరీ గోడను సైతం నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బండదారికి దిక్కెవరు..?

ఆంజనేయపురం ఎస్టీ కాలనీ సమీపంలో సర్వే నంబరు 25లోని బండదారిని సైతం టీడీపీ నాయకులు వదల్లేదు. 25 సెంట్లకు పైగా ఉన్న ఈ భూమిలో కొద్ది రోజులు పాటు గ్రావెల్‌ను తరలించి చదును చేశారు. దీనిపై ప్రశ్నిస్తే టీడీపీ నాయకులు దాడులు చేసి అక్రమంగా కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేతబీడు మాయం

తరతరాలుగా మేతబీడుగా ఉన్న భూమిపై ఓ హోంగార్డు కుటుంబ సభ్యుల కన్నుపడింది. ఇంకేముంది అనుకున్నదేతడువుగా ఆక్రమణలకు తెగబడ్డారు. రామిరెడ్డిపల్లి లెక్కదాఖల సర్వే నంబరు 84/1లో సుమారు 75 సెంట్ల వరకు ఖాళీ జాగా ఉంది. స్థానిక టీడీపీ నేతల సహకారంతో హోంగార్డు కుటుంబీకులు ఆ భూమని ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటుకున్నారు. ఆపై ఫెన్సింగ్ కూడా వేసేశారు. ఈ మేతబీడుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డుకు కేటాయించింది. అయితే టీడీపీ నేతల అండతో ఆ భూమి కబ్జాకు గురైంది.

పాలడిపో స్థలం గోవిందా..!

రైతుల సంక్షేమం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సైతం టీడీపీ నాయకులు వదల్లేదు. రామిరెడ్డిపల్లె లెక్కదాఖల కాటమరాజుల మిట్ట వద్ద సర్వే నంబరు 489లోని 60 సెంట్ల భూమిని గతంలో పాలడిపో నిర్మాణం కోసం కేటాయించారు. ప్రభుత్వం మారడంతో స్థానికంగా ఉండే టీడీపీ నేత కన్ను ఆ భూమిపై పడింది. వెంటనే ఆ నేత అందులో మామిడి మొక్కలను నాటి భూమిని హస్తగతం చేసుకున్నారు.

జాడలేని రెవెన్యూ యంత్రాంగం

రామిరెడ్డిపల్లె పంచాయతీలో ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా రెవెన్యూ శాఖలోని కొంత మంది అధికారులు మౌనం వహిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి, ప్రభుత్వ భూములను పరరిక్షించాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు

ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రభుత్వ భూముల పరిరక్షణలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రామిరెడ్డిపల్లె పంచాయతీలో ఆక్రమణలకు సంబంధించి విచారణ చేపడతాం. ఆక్రమణలని తేలితే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకుంటాం.

– శివరామ సుబ్బయ్య, తహసీల్దార్


బండదారిని ఆక్రమించి ఫెన్సింగ్ కోసం రాళ్లను సైతం సిద్ధం చేసుకున్న టీడీపీ నేతలు


మేతబీడులో డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని ఆక్రమించుకుని మామిడి మొక్కలు నాటి ఫెన్సింగ్ వేసిన కబ్జాదారులు


కాటమరాజులమిట్ట వద్ద పాలడిపోకు కేటాంయిచిన భూమిలో నాటిన మామిడి మొక్కలు

మొక్కలతోనే మానవ మనుగడ


మొక్క నాటుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వైకుంఠపురం ఆర్చి రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్త కుప్పలను తొలగించి మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని కోరారు. భావి తరాలకు మంచి వాతావరణం అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.